సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 29 | ఏప్రిల్ | 2025



కేయూలో విద్యార్థుల ఆందోళన

కేయూ హాస్టళ్లు, మెస్‌లను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ.. విద్యార్థులు ఆందోళన చేశారు.

- 8లో▸



వసంతోత్సవానికి వేళాయె

కాజీపేట పట్టణంలోని శ్వేతార్క మూల గణపతి ఆలయంలో రేపటి (బుధవారం) నుంచి వసంతోత్సవాలు నిర్వహించనున్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

$40^0/25^0$

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట: తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ల్యాండ్ సర్వేలో శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా డైరెక్టర్ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లకుపైగా వయస్సున్న వారు ఫీజు చెల్లించి శిక్షణ తీసుకోవాలన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేయనున్నట్లు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 79892 50779, 99496 84763 నంబర్‌లకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి..



విద్యారణ్యపురి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి గణేశ్ కోరారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో.. విద్యార్థుల నమోదు, దివ్యాంగ విద్యార్థులకు భవిత సెంటర్లలోని సేవలపై, వయోజన విద్య, ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలపై మహిళా సంఘాల పాత్రపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి బయటి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి, డీఆర్డీఏ డీపీఎం దాసు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ అనగోని సదానందం, మండల విద్యాశాఖ అధికారులు, డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్లు, మహిళా సమాఖ్య సభ్యులు, ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎల్.రఘు నర్సంపేట ఇన్‌స్పెక్టర్‌గా, నర్సంపేటలోని డి.రమణమూర్తి.. సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

నిట్‌తో బీఐఎస్ ఎంఓయూ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సోమవారం పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ కేవీ రావు పరస్పరం ఒప్పంద పత్రాలు అందజేసుకున్నారు. భారతీయ ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎంఓయూ తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఐఎస్ హైదరాబాద్ హెడ్ పీవీ.శ్రీకాంత్, ప్రొఫెసర్లు రతీశ్, రాకేశ్, రాజేశ్ చౌదరి, అజిత్ పాల్గొన్నారు.


4 బార్లు.. 491 దరఖాస్తులు

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెన్యువల్ కాకుండా మిగిలిన 4 బార్లకు ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఆ బార్లను దక్కించుకునేందుకు అనూహ్య స్పందన వచ్చింది. 4 బార్లకు 491 దరఖాస్తులు వచ్చాయి. ప్రతీ దరఖాస్తుకు లక్ష రూపాయల ఫీజు కేటాయించగా.. రూ.4.91 కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖ ఖజానాకు చేరింది. ఒక్కో బారుకు 122మంది పోటీపడుతున్నారు.

నేడు కేటాయింపు..

హనుమకొండ కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా ద్వారా బార్లను కేటాయించనున్నారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. వరంగల్ అర్బన్, ఖిలావరంగల్, హనుమకొండ, కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులున్నారు.

పోలీస్ కుటుంబాలకు భద్రత చెక్కుల అందజేత



హన్మకొండ చౌరస్తా: పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ.. పలు కారణాలతో మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు సోమవారం సీపీ సన్‌ప్రీత్‌సింగ్ భద్రత చెక్కులు అందజేశారు. మరణించిన వారిలో ఏఎస్‌ఐ మల్లికార్జున్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రమేశ్ కుటుంబ సభ్యులకు పోలీస్ భద్రతా విభాగం మంజూరు చేసిన రూ.7,89,920 చొప్పున చెక్కులను సీపీ చేతుల మీదుగా ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా వారి కుటుంబ స్థితిగతులపై సీపీ ఆరా తీశారు. కార్యక్రమంలో డీసీపీ రవి, ఏఓ రామకృష్ణస్వామి, సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

సులువుగా అధికారుల దృష్టికి విద్యుత్ సమస్యలు

- కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీ ఎన్పీడీసీఎల్
- వినియోగదారుడు ఇంటినుంచే సమస్య పరిష్కరించుకునే అవకాశం

హన్మకొండ: వినియోగదారులకు మెరుగైన సేవలందించడంపై టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. తరచూ ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ఇంటి నుంచి పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించింది. ఇందుకోసం కొత్తగా వాట్సాప్ చాట్‌బాట్‌ను తీసుకొచ్చింది. దీంతో విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ ద్వారా తమ సమస్యను సులువుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.



సులువుగా సమస్యను పరిష్కరించుకోవచ్చు..





వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా సులువుగా సమస్యను పరిష్కరించుకోవచ్చు. వినియోగదారుడికి ఉత్తమ సేవలందించడంలో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని సత్వర విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి వాట్సాప్ చాట్‌బాట్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం తీసుకొచ్చింది. టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

- పి.మధుసూదన్‌రావు, కె.గౌతంరెడ్డి, హనుమకొండ, వరంగల్ సర్కిల్ ఎస్‌ఈలు

ఏం చేయాలంటే..

మొదట వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సాప్‌లో 79016 28348 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెట్టగానే వెల్‌కమ్ టు టీజీ ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్ అని వస్తుంది.

- రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది.
- రిజిస్టర్ కంప్లయింట్‌పై క్లిక్ చేయగానే.. వాట్సాప్‌లో విత్ యూనిక్ సర్వీస్ నంబర్, విత్ అవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ అని వస్తుంది.
- విత్ యూనిక్ సర్వీస్‌ను ఎంచుకుని నంబర్ ఎంటర్ చేయగానే వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ వివరాలు వస్తాయి.

ఆ వివరాలను ఓకే చేయగానే కంప్లైంట్‌కు సంబంధించిన వివిధ రకాలు సవివరంగా మెనూలో కనిపిస్తాయి.

- ఇందులో కంప్లైంట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ వస్తుంది. ఇలా ఏజెంట్‌తో చాట్ చేయవచ్చు లేదా కంప్లైంట్ నమోదు చేసుకోవచ్చు.
- కంప్లైంట్ ఐడీతో ఒక నంబర్ జనరేట్ అయ్యి మీ ఫిర్యాదు నమోదవుతుంది. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారికి సమాచారం వెళ్తుంది.
- ఇదే సమాచారం.. వినియోగదారుడికి చేరుతుంది. కంప్లయింట్ ఐడీతో వినియోగదారుడు తమ సమస్య పరిష్కారమైందా.. లేదా? ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.
- కంప్లైంట్ ప్రక్రియ పూర్తి కాగానే వినియోగదారుడి వాట్సాప్‌నకు సమాచారంతోపాటు ఐవీఆర్ఎస్ ద్వారా కాల్ వెళ్తుంది.
- అనంతరం సమస్య పరిష్కారం అయ్యాక తర్వాత ఫీడ్ బ్యాక్ ఇవ్వమని అడుగుతుంది. లేదా.. సంతృప్తి చెందని పక్షంలో మళ్లీ కంప్లైంట్ రీఓపెన్ చేయాలా? అని అడుగుతుంది.
- చివరగా టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో వాట్సాప్ ఐకాన్ కనిపిస్తుంది. ఈ ఐకాన్ క్లిక్ చేసి మరిన్ని వివరాల్ని పొందుపర్చడానికి చాట్ చేయవచ్చు.

రేవంత్‌రెడ్డి కుట్ర.. పోలీసుల అమలు

- 2వేల మంది అని చెప్పి 20 మందినీ కేటాయించలేదు..
- రజతోత్సవ సభ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

8లో▸

జయశంకర్‌ను విస్మరించడం బాధాకరం

- కేసీఆర్ ఒంటెద్దు పోకడలకు సభ నిదర్శనం
- జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధ్వజం

8లో▸

అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

- ఆపరేషన్ కగార్ కొనసాగుతుంది..
- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు

8లో▸

ఇరిగేషన్‌లో ఏసీబీ గుబులు!

చర్చనీయాంశంగా ఎండీ హరిరామ్‌పై దాడులు

- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజనీర్లు ఇక్కడి వాళ్లే..
- ఇప్పటికే 17మందిపై క్రిమినల్ కేసులు
- 30మందిపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు
- తాజాగా ఏసీబీ దాడులకు దిగడంతో కలకలం
- ఆదాయానికి మించిన ఆస్తులే కారణం
- ఎటు నుంచి ఎటొస్తుందోనన్న ఆందోళన





సాక్షిప్రతినిధి, వరంగల్ :

నీటి పారుదల శాఖలోని కొందరు ఇంజనీర్లలో మళ్లీ ఏసీబీ కలకలం మొదలైంది. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఆందోళనలో పడ్డారు. మేడిగడ్డ మొదలుకుని కన్నెపల్లి, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పలు ప్యాకేజీ పనుల్లో లొసుగులపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. ఇప్పటికే చాలా మందిని విచారించిన ఆ కమిటీ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందించింది. ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టు పరిధిలోని వివిధ కేడర్‌లలో ఉన్న 17 మందిపై క్రిమినల్ కేసులు, 30 మందిపై శాఖాపరమైన చర్యలను సిఫారసు చేశారు. ఇదే సమయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆదాయానికి మించిన ఆస్తులున్నట్లు గుర్తించి ప్రాజెక్టు ఎండీ హరిరామ్ ఇళ్లలో సోదాలు నిర్వహించి అరెస్టు చేయడం సంచలనంగా మారింది.

విచారణలతో ఉక్కిరిబిక్కిరి..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగి, పియర్లు దెబ్బతిన్న ఘటనలో తొలుత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల సీపేజీపైనా విచారణ జరిపి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణాలపై వివరంగా నివేదించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏకంగా 17 మంది సీనియర్ ఇంజనీర్లపై క్రిమినల్ కేసులకు సిఫార్సు చేసింది. అందులో అంతా మేడిగడ్డతో సంబంధం ఉన్నవారేనని తెలిసింది. నిర్మాణంతోపాటు డిజైన్లు, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తదితర విభాగాల్లో పనిచేసిన ఇంజనీర్లు ఉన్నట్లు ప్రకటించారు. క్రిమినల్ కేసుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫార్సు చేసిన వారిలో కాళేశ్వరం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుతోపాటు గతంలో ఎస్‌ఈగా పనిచేసిన రమణారెడ్డి, ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి రావు సహా 17 మంది ఉన్నారు. శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేసిన 30 మందిలో వివిధ విభాగాలకు చెందిన డీఈఈ, ఏఈఈలు ఉన్నట్లు తెలిసింది. నివేదికలో ఉన్న ఇంజనీర్లను పదోన్నతులకు పరిశీలనకు తీసుకోవాలా.. లేదా? అనేది తేల్చుకోలేక ఉన్నతాధికారులు పెండింగ్‌లో పెట్టారు. అలాగే నిర్మాణ సమయంలో నాణ్యత తనిఖీ విభాగం, నిర్వహణ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం ఇంజనీర్లు వైఫల్యం చెందినట్లుగా నిర్ధారించి, వారిపైనా కేసులకు సిఫార్సు చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి మాజీ ఈ ఎన్సీ మురళీధర్, ప్రస్తుత చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తదితరులపైనా చర్యలకు సిఫార్సు చేసినట్లు తెలుస్తున్నా, శాఖాపరమైన చర్యలా? క్రిమినల్ చర్యలా? అన్నది తేలలేదు. ఏదేమైనా 'కాళేశ్వరం' వివాదంలో చిక్కుకున్న పలువురు ఇంజనీర్లు విచారణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఏసీబీ రంగప్రవేశం.. ఆందోళనలో ఇంజనీర్లు

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు వివాదంలో రంగంలోకి దిగిన ఏసీబీ.. ప్రాజెక్టులో ముఖ్య భూమిక పోషించిన నీటి పారుదల శాఖ గజ్వేల్ ఈఎన్సీ భుక్యా హరిరామ్‌పై దాడులు నిర్వహించడం నీటి పారుదలశాఖను కుదిపేసింది. భారీగా అక్రమాస్తులు కూడబెట్టారనే అభియోగాల నేపథ్యంలో శుక్రవారం, శనివారం దాడులు నిర్వహించి.. శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ప్రకటించింది. మొత్తం ఆయన వద్ద ప్రాథమికంగా రూ.200 కోట్ల మేర అక్రమాస్తులుంటాయని భావించిన ఏసీబీ ఇంకా తనిఖీలు కొనసాగిస్తోంది. ఇదే క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న కొందరు అధికారుల ఆస్తుల గురించి కూడా ఏసీబీ ఆరా తీస్తుందన్న ప్రచారం ఇంజనీరింగ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో ఓ వైపు కొందరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎన్‌డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ విచారణలు ఎదుర్కొంటుండగా.. మరోవైపు ఆదాయానికి మించిన ఆస్తుల పేరిట ఏసీబీ దాడులు నిర్వహిస్తుండడంతో ఆరోపణలున్న ఇంజనీర్లలో ఆందోళన మొదలైంది.

రోల్‌మోడల్‌గా భూ భారతి చట్టం



భూభారతి చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులు

- జూన్ 2 నుంచి అన్ని గ్రామాల్లో సదస్సులు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్లు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఅవగాహన సదస్సులో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి.. దేశానికి రోల్ మోడల్‌గా భూభారతి చట్టాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకొచ్చామని మంత్రులు తెలిపారు.

- వివరాలు 8లో▸ - సాక్షిప్రతినిధి, వరంగల్/ఎల్కతుర్తి

రిసోర్స్‌పర్సన్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఉపాధ్యాయుల శిక్షణ కోసం వివిధ సబ్జెక్టుల్లో అర్హులైన ఉపాధ్యాయులను రిసోర్స్‌పర్సన్లుగా ఎంపిక చేసేందుకు ఇటీవల విద్యాశాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కాలేజీలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై ఇతర సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 80 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో రిసోర్స్‌పర్సన్ల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. పలు సబ్జెక్టులకు టీచర్లు హాజరు కాలేదు. ఇంకా కొందరు టీచర్లను రిసోర్స్‌పర్సన్లుగా ఎంపిక చేసే అవసరం ఉంది. ప్రస్తుతం ఇంటర్వ్యూలకు వచ్చిన వారిలో నుంచి ఎంత మందిని ఎంపిక చేస్తారో రెండు రోజుల్లో తేలనుంది.

నేటి నుంచి 'భద్రకాళి'

కల్యాణ బ్రహ్మోత్సవాలు షురూ

- ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ
- మే 2న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ శేషు భారతి, భద్రకాళి శేషు, దేవాలయ సిబ్బంది

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో ఏప్రిల్ 29 నుంచి మే 10 వరకు భద్రకాళీభద్రేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం అంకురార్పణ పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం శేషుభారతి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల కోసం, తదితర ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఒక్కోరోజు వివిధ కుల సంఘాల వారు అమ్మవారి సేవల్లో పాల్గొనడానికి ముందుకు వచ్చినట్లు ఆరోజున వారి నిర్వహణలోనే పూజా కార్యక్రమాలు జరుగుతాయని ప్రతీ రోజు ఉదయం 11 గంటలకు, సాయంత్రం 7 గంటలకు అత్యంత వైభవంగా వాహన సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 2న జరిగే కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.516 చెల్లించి రశీదు పొందాలని వారికి ప్రసాదం, అక్షింతలు, శేష వస్త్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాల్ని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు భద్రకాళి శేషు కోరారు. సమావేశంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, దేవాలయ సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, సిబ్బంది చింతశ్యాంసుందర్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కార్పొరేషన్ పదవుల భర్తీ

- టీపీసీసీ జిల్లా పరిశీలకులు
- నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం



పహల్గాం మృతులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

హన్మకొండ చౌరస్తా: ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవులను త్వరలో భర్తీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుందని టీపీసీసీ హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిశీలకులు మసూద్ అహ్మద్, వినయ్‌రెడ్డి, మేడి రవిచంద్ర, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సోమవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, టీపీసీసీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకులు మాట్లాడుతూ.. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారిని గుర్తించాలన్నారు. గ్రామ, మండల, పట్టణ, బ్లాక్ స్థాయి కమిటీలకు సుమారు ఐదుగురి పేర్లతో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పదవుల్లో ఉన్నవారు పార్టీ కోసం పని చేయాలని, పని చేయలేని వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని కోరారు. పహల్గాం మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ రియాజ్, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, పసునూరి దయాకర్, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ సుధారాణి, నాయకులు మార్నేని రవీందర్‌రావు, దొమ్మాటి సాంబయ్య, వీసం సురేందర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణికి 115 ఫిర్యాదులు



గ్రీవెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 115 ఫిర్యాదులు వచ్చాయి. గ్రేటర్ వరంగల్ పరిధి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో ఇంజనీరింగ్ 20, హెల్త్ శానిటేషన్ 7, ప్రాపర్టీ ట్యాక్స్ (రెవెన్యూ) 17, టౌన్ ప్లానింగ్ 52, మంచి నీటి సరఫరా 14, ఎలక్ట్రికల్ 2, జనరల్ 3తో కలిపి మొత్తం 115 అర్జీలు వచ్చినట్లు సెక్షన్ ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాపూర్ నర్సరీ తనిఖీ



నర్సరీని పరిశీలిస్తున్న మేయర్

వరంగల్: మహానగర పాలక సంస్థ పరిధి హసన్‌పర్తి ఎల్లాపూర్‌లో నిర్వహిస్తున్న నర్సరీని మేయర్ సుధారాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పెంచుతున్న మొక్కల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ సిబ్బంది విధులు, రిజిస్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న గ్రీన్ షెడ్‌ను విస్తరించి మొక్కలన్నీ నీడలో ఉండేలా చూడాలని, అదనంగా సిబ్బందికి అవసరమయ్యే పని ముట్లు కల్పించాలని హార్టికల్చర్ అధికారి రమేశ్‌కు ఆదేశాలిచ్చారు.

రేవంత్‌రెడ్డి కుట్ర.. పోలీసుల అమలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు

- రజతోత్సవ సభ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

హన్మకొండ : రజతోత్సవ సభను విఫలం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్రలను పోలీసులు అమలు చేశారని బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూజర్ చార్జీలు వసూలు చేసిన పోలీసు శాఖ అరకొరగా సిబ్బందిని కేటాయించిందని, గతంలో ఎప్పుడైనా ఏ రాజకీయ పార్టీ వద్ద యూజర్ చార్జీలు వసూలు చేసిందా అని ప్రశ్నించారు. 2,000 మంది పోలీసు సిబ్బందిని కేటాయిస్తామని చెప్పి 20 మందిని కూడా ఇవ్వలేదన్నారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి వెళ్లి తాను ట్రాఫిక్ క్లియర్ చేశామన్నారు. సభకు రైతులు స్వచ్ఛందంగా స్థలం ఇచ్చారన్నారు. ఆ భూములను తిరిగి యథావిధిగా తయారు చేసి రైతులకు అప్పగిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిగా, 10 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన కేసీఆర్‌ను ప్రజలు గుండెలో పెట్టుకున్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏ రోజు డ్యూటీలు చేయని రవాణా శాఖ అధికారులు ఆదివారం సెలవు రోజైనా రోడ్ల పైకి వచ్చి సభకు వస్తున్న వాహనాలను తనిఖీ చేసి అడ్డంకులు సృష్టించారని ధ్వజమెత్తారు. హనుమకొండ, ములుగు రోడ్డులో తనిఖీలు చేశారని అదే సమయంలో తానుంటే వారిని బట్టలూడదీసి ఉరికించేవాడినని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు పులి రజనీకాంత్, భీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, పోలంపల్లి రామ్మూర్తి, బి.వీరేందర్, రవీందర్ రావు. పానుగంటి శ్రీధర్, దూలం వెంకన్న, నయిముద్దీన్ పాల్గొన్నారు.

అబద్ధాలు మాట్లాడడంలో కేసీఆర్ దిట్ట



విలేకరులతో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు, చిత్రంలో కొలను సంతోష్‌రెడ్డి, రావు పద్మ, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాములు, కొండేటి శ్రీధర్, ఆయా జిల్లాల అధ్యక్షులు

- ఆపరేషన్ కగార్ కొనసాగుతుంది
- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు

హన్మకొండ : అబద్ధాలు మాట్లాడడంలో కేసీఆర్ దిట్ట అని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు ఎద్దేవా చేశారు. సోమవారం హనుమకొండలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాలు మాట్లాడడంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ పడుతున్నారని దుయ్యబట్టారు. ఆపరేషన్ కగార్ కొనసాగుతుందని, దేశ సరిహద్దులో పాకిస్తాన్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాట్లాడరని, ఇప్పుడు ఆపరేషన్ కగార్‌పై స్పందించడం హాస్యాస్పదమని విమర్శించారు. మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ టీఆర్ఎస్ స్థాపించి 25 ఏళ్లు అయ్యిందా, బీఆర్ఎస్ స్థాపించి 25 ఏళ్లు అయ్యిందా అని రజతోత్సవ సభ నిర్వహించారని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఎంఐఎం అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలిచేందుకు పోటీ నుంచి తప్పుకున్న మీరు ముస్లింలకు మద్దతు ఇస్తున్నావా.. హిందువులకు మద్దతు ఇస్తున్నావా అని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇవ్వలేదని కేసీఆర్ మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు.మహాలక్ష్మి స్వరూపులైనా ఆడపిల్లలను ఆడపోరీలు అని అవమాన పరిచిన కేసీఆర్ మహిళలకు బహిరంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు, నాయకుడు పగడాల కాళీప్రసాద్ పాల్గొన్నారు.

జయశంకర్‌ను విస్మరించడం బాధాకరం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, చిత్రంలో వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ తదితరులు

- కేసీఆర్ ఒంటెత్తు పోకడలకు సభ నిదర్శనం
- జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధ్వజం

హన్మకొండ చౌరస్తా : స్వరాష్ట్ర తెలంగాణ కోసం జీవితాన్నే త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌ను బీఆర్ఎస్ సభలో కేసీఆర్ విస్మరించడం బాధాకరమని వరంగల్ పశ్చిమ, పరకాల, ఘన్‌పూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రూ.400ల కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించిన సభలో అయ్యా కొడుకుల ఫొటోలు తప్పితే ఎవరివీ లేకపోవడం, మరొకరి ప్రసంగం లేకుండా ఒక్కడే మాట్లాడడం కేసీఆర్ ఒంటెత్తు పోకడలకు నిదర్శనమన్నారు. జైల్లో పెడుతారనే భయంతోనే బీజేపీతో కుమ్మక్కై గత ఎన్నికలలో తటస్థంగా ఉన్నారని ఆరోపించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అంటున్న కేసీఆర్, బీఆర్ఎస్ బీ ఫాంతో గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని చెప్పిన కేసీఆర్ తన హయాంలోనూ మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు జరిగాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని అన్నారు. సభకు హాజరయ్యే ముందు కేసీఆర్‌కు బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్షలు చేస్తే బాగుండని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలను అగౌరవపరిచేలా మాట్లాడారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ది డెకాయిట్ల కుటుంబమని, గొర్రెల పథకంలో అక్రమంగా సంపాదించి బీఆర్ఎస్ నాయకులు గొర్రెల మాదిరిగా తయారయ్యారని అన్నారు. సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి టీజీఎప్‌సెట్ పరీక్షలు

- రెండ్రోజులు అగ్రికల్చరల్, ఫార్మసీ
- 2నుంచి ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు..
- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ

విద్యారణ్యపురి : రాష్ట్రంలో 2025–26 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న టీజీఎప్‌సెట్ పరీక్షలు నేటినుంచి జరుగనున్నాయి. ఈనెల 29, 30 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నారు. మే 2నుంచి 4వతేదీ వరకు ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ఎప్‌సెట్ పరీక్ష జరుగనుంది. ప్రతిరోజు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. సీబీటీ ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షలకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. హాల్‌టికెట్లపై క్యూ ఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. దీని ద్వారా పరీక్ష కేంద్రాన్ని సులువుగా తెలుసుకునే వీలు కలుగుతుంది. వరంగల్ జోన్‌లోని పలు పరీక్ష కేంద్రాల్లో అగ్రికల్చరల్, ఫార్మసీలో ప్రవేశాలకు 5,845 మంది, నర్సంపేటలో 1,078 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు గాను వరంగల్ జోన్ పరిధిలో 11,785 మంది, నర్సంపేట జోన్‌లో 2,158 మంది విద్యార్థులు రాయబోతున్నారని కన్వీనర్ కుమార్ తెలియజేశారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

ఆయా పరీక్ష కేంద్రాలకు నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించబోరు. ఉదయం సెషన్‌కు ఉదయం 7:30 గంటల కల్లా చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం సెషన్‌కు 1:30గంటల కల్లా విద్యార్థులు చేరుకోవాలి. ఫొటో ఐడీ, హాల్‌టికెట్‌తో పాటుగా బాల్ పాయింట్ పెన్‌ను తీసుకెళ్లాలి.

వసంతోత్సవానికి వేళాయె

శ్వేతార్క ఆలయం ముస్తాబు

- రేపటి నుంచే వేడుకలు ప్రారంభం
- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక





విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆలయ గోపురం (ఇన్‌సెట్‌లో) శ్వేతార్క మూలగణపతి

కాజీపేట : స్వయంభుగా ప్రకాశితమై.. వేలాది మంది భక్తుల కోరికలను తీరుస్తూ.. ఇంటి ఇలవేల్పుగా భాసిల్లుతున్న శ్వేతార్క మూలగణపతి కాజీపేట పట్టణంలో కొలువై 27 ఏళ్లు పూర్తయ్యాయి. నిర్విఘ్న పూజాలందుకుంటున్న శ్వేతార్కుడిని దర్శించి తరించడానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. దాతలు అందజేసిన రూ.3.5 కోట్లకు పైగా ఆర్థికసాయంతో ఒకే ప్రాంగణంలో శ్వేతార్కుడితోపాటు శైవ, వైష్ణవ సంప్రదాయ పద్ధతుల్లో నిర్మితమైన ఆలయాల్లో 29 దేవతామూర్తులు కొలువుదీరి పూజలు అందుకుంటున్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న శ్వేతార్కాలయంలో రేపటినుంచి 4వ తేదీవరకు ఐదు రోజుల పాటు వసంతోత్సవ వేడుకలు కనుల పండువగా జరుగనున్నాయి.

ఆలయానికి ఇలా చేరుకోవాలి

శ్వేతార్కుడిని దర్శించుకోవడానికి రైలు, రోడ్డు మార్గాలు ఉన్నాయి. భక్తులు కాజీపేట రైల్వే జంక్షన్‌లో రైలు, ప్రధాన రహదారిపై బస్సు దిగి చౌరస్తాకు వచ్చి 300 మీటర్ల దూరం సోమిడి రోడ్డు వైపు నడిస్తే చాలు శ్వేతార్క ఆలయం కన్పిస్తోంది. పండుగలతోపాటు ప్రతి మంగళవారం, శనివారం విశేష పూజలు నిర్వహిస్తుంటారు.

చారిత్రక నేపథ్యం..

ఆలయ వ్యవస్థాపకుడు, ఇటీవల శివైక్యం చెందిన ఐనవోలు అనంత మల్లయ్య శర్మకు 1999లో గణపతి దేవుడు స్వప్నంలో సాక్షాత్కారించి నల్లగొండ జిల్లాలోని మాడా ప్రభాకర్‌శర్మ ఇంటి పరిసర ప్రాంతంలో ఉన్న తెల్ల జిల్లేడు చెట్టు మొదలులో ఉన్నట్లుగా చెప్పి అదృశ్యమయ్యాడు. ఉదయం లేచి తర్వాత పెద్దలకు విషయం తెలిపి జిల్లెడు చెట్టు వేరులో ఉన్న స్వామివారి మూర్తిని గ్రహించి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కాజీపేటలో ప్రతిష్ఠించారు. 2009లో పద్దెనిమిదిన్నర కిలోల వెండి కవచాన్ని శ్వేతార్కుడికి తొడిగి స్థిర ప్రతిష్ఠచేశారు. 2010లో దేశ చరిత్రలోనే స్వామివారికి గణాధిపత్యయోగ పట్టాభిషేకం జరిపించారు. ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన శిల్పుల చేతిలో శ్వేతార్క ఆలయం రూపుదిద్దుకుంది.ఆలయ శిఖరంపైకి చేరుకుని గుడి వెనక భాగం వైపు చూస్తే గణపతి దేవుడి వాహనమైన ఎలుకను పోలిన కొండ కన్పిస్తోందని భక్తులు చెబుతుంటారు.

ఉత్సవాల వివరాలు

ఉత్సవాలను 30వ తేదీన లాంఛనంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ప్రారంభిస్తారు. తాడూరి రేణుక బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారు. 1న లక్ష్మినారాయణుల కల్యాణం, సుదర్శన హోమం, లక్ష తమలపాకులతో అర్చన, పరవస్తు హరిషత నాగిని బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 2న ఆలయంలో శ్వేతార్క మూల గణపతికి పుట్టిన రోజు వేడుకలు జరిపించనున్నారు. 3న స్వామి వారికి గంగా జలం, నల్ల ద్రాక్ష రసంతో అభిషేకం, మృత్యుంజయ పాశుపాత, ఆయుష్య హోమం, శ్రీవల్లీదేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తారు. లక్ష దమన అర్చన, బాలలచే కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. 4న పూర్ణాహుతి, సిద్ధిబుద్ధి సమేత శ్వేతార్కుడికి కల్యాణ వేడుకలతో ఉత్సవాలు ముగించడం జరుగుతుందని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పేర్కొన్నారు.

రైల్వే ట్రాక్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు

- ఉప్పల్‌లో నవజీవన్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత
- కేసు నమోదు చేసిన కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులు



ఉప్పల్ స్టేషన్ సమీపంలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పై అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో ఆదివారం నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు అంతరాయం ఏర్పడి నిలిచిపోయింది. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సి.చటర్జీ సోమవారం విలేకరులకు తెలిపిన కథనం ప్రకారం.. అహ్మదాబాద్ నుంచి చెన్నై వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఉప్పల్ రైల్వే స్టేషన్ మీదుగా పోతుండగా గేటు మూసి ఉంది. దీంతో గేట్ వద్ద వాహనాలు ఆగిఉన్నాయి. ఈ సమయంలో ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభకు వెళ్లిన కార్యకర్తలు తిరుగు ప్రయాణంలో అధిక సంఖ్యలో ట్రాక్ దాటుతుండగా గమనించిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్ ప్రమాదం జరగకుండా రైలుని నిలిపి వేశారు. దీంతో సాయంత్రం 6:14 నుంచి 6:24 గంటల వరకు రైలుకు అంతరాయం ఏర్పడి నిలిచిపోయింది. రైల్వే సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్పీఎఫ్ సీఐ చటర్జీ, పోలీసులతో కలిసి ఉప్పల్ స్టేషన్‌కు వెళ్లి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఘటనకు బాధ్యులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసే పనిలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు రైలు పట్టాలు దాటుతూ నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు అంతరాయానికి కారకులుగా ప్రాథమికంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చటర్జీ పేర్కొన్నారు.

బొమ్మకూర్‌లో నవీన యుగంనాటి శిలలు

- డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి



శిలను చూపుతున్న రత్నాకర్ రెడ్డి


నర్మెట : జనగామ జిల్లా నర్మెట మండల పరిధి బొమ్మకూర్‌లో నవీన శిలాయుగం నాటి అరుదైన శిలలు ఉన్నాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం గ్రామంలో పర్యటించిన ఆయన నవీన శిలాయుగం నాటి సంగీతం వినిపించే అరుదైన రాతి కళాఖండాన్ని గుర్తించారు. అనంతరం రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ..బొమ్మకూర్ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, జిల్లాలోనే పూర్వకాలం అతిపెద్ద ఇనుము, లోహ పరిశ్రమ ఇక్కడ విలసిల్లిందని పేర్కొన్నారు. 15కిలోల బరువున్న చిట్టెపు రాళ్లు ఇక్కడ ప్రసిద్ధి అని తెలిపారు. అరుదైన రాతి పనిముట్లు, ధాన్యాన్ని నూరే, సంగీతం పలికే శిలలు ఇక్కడ ఉన్నాయని చెప్పారు. అరుదైన శిలాసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రభుత్వం జిల్లా కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు.

సీపీని కలిసిన వరల్డ్ పీస్ బాధ్యులు



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంస్థ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా : వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ బాధ్యులు కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. శాంతి కార్యక్రమాలను సీపీకి వివరించగా సమాజహితానికి చేపట్టే సంస్థలకు సహకారం అందిస్తామని అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న మన పండుగలు కార్యక్రమానికి ఆహ్వానించారు. బి.సురేష్‌లాల్, సంస్థ వ్యవస్థాపకుడు సిరాజుద్దీన్, విష్ణువర్ధన్, పీఆర్‌ఓ నివాస్ పాల్గొన్నారు.



కేయూలో విద్యార్థుల ఆందోళన

- హాస్టళ్లు, మెస్‌లను మూసివేయొద్దని డిమాండ్



కేయూ పరిపాలన భవనంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్ : వేసవి సెలవుల నేపథ్యంలో 1వ తేదీనుంచి కాకతీయ యూనివర్సిటీలో హాస్టళ్లు, మెస్‌లను మూసివేయాలని అధికారులు నిర్ణయించారు. హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సర్క్యులర్ కూడా ఇటీవలనే జారీచేశారు. దీనిని వ్యతిరేకిస్తూ కేయూలోని హాస్టళ్లు, మెస్‌లను యథావిధిగా కొనసాగించాలని మూసివేయవద్దని, సెలవులను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పీజీ కోర్సుల విద్యార్థులు పరిపాలన భవనంలో ఆందోళనకు దిగారు. కొంతమంది విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి.మనోహర్, పాలకమండలి సభ్యుడు బి.సురేష్ లాల్ వివిధ యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాల్స్ చర్చించారు. వేసవిలో హాస్టళ్లు, మెస్‌లను మూసివేస్తారని వారు విద్యార్థులకు తెలియజేశారు.తాము వివిధ పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతున్నామని అందువల్ల హాస్టళ్లను, మెస్‌లను కొనసాగించాలని విద్యార్థులు కోరారు. ఈనెల 30న అన్ని విభాగాల అధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వీసీ విద్యార్థులకు తెలియజేయడంతో వారు ఆందోళన విరమించారు.

రోల్‌మోడల్ 'భూభారతి' చట్టం

- జూన్ 2నుంచి అన్నీ గ్రామాల్లో సదస్సులు
- ప్రజలు కార్యాలయాలకు వెళ్లనక్కర లేదు
- దరఖాస్తు సహా అన్ని అధికారులు చేస్తారు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



హాజరైన ప్రజలు, రైతులు

సాక్షి ప్రతినిధి, వరంగల్/ఎల్కతుర్తి : దేశానికి రోల్ మోడల్‌గా భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. భూసమస్యల పరిష్కారానికి ఈ చట్టం ఒక అద్భుతమైన అస్త్రం అవుతుందని వెల్లడించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా అందులోని అంశాలను హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్ చదివి వినిపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తమ భూ సమస్యలకు సంబంధించి ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురాగా వాటికి భూభారతి చట్టం ద్వారా ఉన్న పరిష్కారం మార్గాలను ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్ జగత్ సింగ్ తెలియజేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. భూ సమస్య ఉన్న రైతు వద్దకే రెవెన్యూ అధికారులు వచ్చి వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్లల్లో సన్న బియ్యం, ఉచిత విద్యుత్ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. రైతుకు భూమికి విడదీయని బంధం ఉంటుందన్నారు. ఎంతోమంది మేధావులు, రైతులు, ఆయా వర్గాల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు చేసినదే భూ భారతి చట్టం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన భూ భారతి చట్టం గురించి అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో రైతులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రులు, కలెక్టర్ మహిళా స్వయం సహాయక సంఘాలకు సబ్సిడీ రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. సదస్సులో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వొడితెల ప్రణవ్ బాబు, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీడీఓ విజయ్ కుమార్, ఇతర అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బీఆర్ఎస్ నాయకుడి మృతి

- ధర్మకంచలో విషాద ఘటన



పానుగంటి ప్రవీణ్ (ఫైల్)

జనగామ : జనగామ పట్టణం ధర్మకంచకు చెందిన పానుగంటి ప్రవీణ్ సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సువార్త ఫిర్యాదు మేరకు సీఐ దామోదర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంధువుల వివాహ వేడుకలకు ప్రవీణ్ కుటుంబ సభ్యులు ఈ నెల 24న హైదరాబాద్‌కు వెళ్లారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ప్రవీణ్ జనగామకు వచ్చాడన్నారు. సభకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత, భార్యకు ఫోన్ చేసినట్లు చెప్పారు. సోమవారం ప్రవీణ్‌కు అతని భార్య ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయక పోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఉరేసుకుని ఉన్నట్లు భార్య, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలుపగా, అందరు జనగామకు వచ్చారు. భర్త చనిపోయిన విధానం, అక్కడి పరిస్థితులు సహజ మరణంగా లేదని మృతుడి భార్య సువార్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి తలుపులు తీసి ఉండడం, లాక్ కూడా వేసుకోక పోవడం అనుమానంగా ఉన్నట్లు పోలీసులకు తెలిపారు. తన భర్త ఆత్మహత్య చేసుకునేంతా పిరికివాడు కాదని, ప్రవీణ్ మృతిపై సెల్ ఫోన్ కాల్ డాటా ఆధారంగా సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని పేర్కొన్నారు. సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచనామా చేసి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబంలో విషాదం

బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ అనుమానాస్పద మృతితో కుటుంబంతో పాటు బీఆర్ఎస్ పార్టీ, మిత్రులు విషాదంలో మునిగి పోయారు. ఎల్కతుర్తి సభ నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి ఇంటికి తిరిగి వచ్చే వరకు కలిసి ఉన్న ప్రవీణ్ ఒక్కసారిగా విగత జీవిగా కనిపించడంతో పార్టీ నాయకులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

దైవదర్శనానికి వెళ్తూ ఒకరి దుర్మరణం

ఎస్ఎస్‌తాడ్వాయి : వేములవాడ దైవ దర్శనానికి వెళ్తున్న ఆటోను సోమవారం బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతిచెందాడు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం. భద్రాద్రికొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన గొరెంట్ల శ్రీను (45) కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడకు వెళ్తున్నారు. తాడ్వాయికి సమీపంలో కాటాపూర్ వైపు వెళ్తున్న బొలెరో వాహన డ్రైవర్ అతివేగంతో వెళ్లడంతో ఆటోను ఢీకొట్టాడు. దీంతో ముందు సీటులో కూర్చున వ్యక్తిని బొలెరో వాహనం బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడగా స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి చిరంజీవి నిర్ధారించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

తొర్రూరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మండలంలోని ఫత్తేపురం స్టేజీ వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. దంతాలపల్లికి చెందిన రాయల మంజునాథ్ (17) వ్యక్తిగత పనుల నిమిత్తం తొర్రూరుకు వచ్చి బైక్ పై తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఖమ్మం నుంచి తొర్రూరు వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో మంజునాథ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో తొర్రూరులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో బిహార్ కూలీ మృతి

మహబూబాబాద్ రూరల్ : వడదెబ్బతో బిహార్ కూలీ మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని లక్ష్మతండా గ్రామపరిధిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక సోమవారం కేసు వివరాలు వెల్లడించారు.. బిహార్ రాష్ట్రానికి చెందిన తులసి ముత్రా (59) మండలంలోని లక్ష్మతండాలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో అతను కూలీగా పని చేస్తున్నాడు. కాగా శనివారం ఉదయం నుంచి ఎండలో పనిచేసి సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోటి కూలి వీరేందర్ రామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మసాగర్‌లో వృద్ధుడు..

ధర్మసాగర్ : వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దువ్వల రాజయ్య (75) కుటుంబ సభ్యులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. రోజు మాదిరిగానే ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి ఇంటి వచ్చాడు. రాజయ్యకు దాహంగా ఉందని చెప్పగా నీటిని ఇచ్చిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు, బంధువులు కోరుతున్నారు.